సాక్షి
తిరుపతి
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024

పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ ప్రయోగం ఇలా..

పీఎస్ఎల్వీ సీ–60 రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగించారు. మొదటి, మూడో దశలు ఘన ఇంధనంతో, రెండు, నాలుగు దశలు ద్రవ ఇంధనంతో నిర్వహించారు. ఈ ప్రయోగంలో 440 కిలోల బరువు కలిగిన స్పాడెక్స్ పేరుతో రెండు జంట ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు.

- పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ 44.5 మీటర్లు ఎత్తు కలిగి ప్రయోగ సమయంలో 229 టన్నులతో ప్రయాణం ప్రారంభించింది. దీనికి స్ట్రాపాన్ బూస్టర్లు లేవు కాబట్టి 229 టన్నుల బరువుతో నింగివైపు దూసుకెళ్లింది.
- కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనాన్ని నింపి 111.12 సెకండ్లకు మొదటి దశను పూర్తిచేశారు.
- రెండో దశలో 188.32 సెకండ్లకు రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాలకు అమర్చిన రక్షణ కవచం హీట్‌షీల్డ్ విడిపోయింది. ఈ దశలో 41 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 262.06 సెకండ్లకు పూర్తిచేశారు.
- మూడో దశలో 7.65 టన్నుల ఘన ఇంధనంతో 511.22 సెకండ్లకు పూర్తిచేశారు.
- 1.6 టన్నుల ద్రవ ఇంధనంతో 792.48 సెకండ్లకు నాలుగో దశను కటాఫ్ చేశారు.
- తర్వాత ట్రిమ్మింగ్ మాడ్యూల్‌తో 909.48 సెకండ్లకు అంటే 15.15 నిమిషాలకు 220 కిలోలు బరువు కలిగిన స్పాడెక్స్–బీ అంటే టార్గెట్ ఉపగ్రహాన్ని, 912.48 సెకండ్లకు అంటే 15.20 నిమిషాలకు మరో 220 కిలోల బరువు కలిగిన స్పాడెక్స్–ఏ అంటే ఛేజర్ ఉపగ్రహాలు రెండింటినీ భూమికి 470 కిలోమీటర్లు ఎత్తులో సెమీ మేజర్ యాక్సిస్ అనే కొత్తరకం కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.



నిప్పులు చిమ్ముతూ..నింగిని తాకుతూ..

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించిన పీఎస్ఎల్వీ రాకెట్ బహుళ ప్రయోజనకారిగా విజయవిహారం చేస్తోంది. ప్రపంచపటం మీద ఇస్రో తిరుగులేని విజయాలను సాధిస్తూ వజ్రాయుధంగా మారింది. పోలార్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (పీఎస్ఎల్వీ) వాణిజ్యపరమైన ప్రయోగాల్లో అగ్రస్థానంలో వెలుగొందుతూ బహుళ ప్రయోజనకారిగా మారింది.



నింగిలోకి దూసుకెళుతున్న పీఎస్ఎల్వీ సీ60 రాకెట్

టార్గెట్‌ను మించి..
ఛేజర్‌ను దించి!

జంట ఉపగ్రహాలను మోసుకెళ్లిన వాహన నౌక

- నిర్ణీత కక్ష్యలో టార్గెట్, ఛేజర్ ఉపగ్రహాలు
- షార్‌లో సంబరాలు చేసుకున్న శాస్త్రవేత్తలు



రాకెట్ ప్రయోగాన్ని గ్యాలరీ నుంచి ఆసక్తిగా తిలకిస్తున్న ప్రేక్షకులు


సూళ్లూరుపేట: శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి సోమవారం రాత్రి 10.0015 గంటలకు ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ60 ప్రయోగంతో విజయవంతమైంది. ఇప్పటిదాకా 62 ప్రయోగాలు చేయగా రెండు ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. 1993 సెప్టెంబర్ 20న పీఎస్ఎల్వీ డీ1 పేరుతో మొదటి ప్రయోగాన్ని నిర్వహించారు. దురదృష్టవశాత్తూ ఆ ప్రయోగం విఫలమైంది. మళ్లీ 2018లో ఒక ప్రయోగం విఫలమైంది. గడిచిన 30 సంవత్సరాల్లో పీఎస్ఎల్వీ సీ60 ప్రయోగంతో 60 ప్రయోగాలను విజయవంతం చేశారు. ఇప్పటి దాకా 62 పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా 505 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇందులో 433 విదేశీ ఉపగ్రహాలే కావడం విశేషం. 72 స్వదేశీ ఉపగ్రహాలతో పాటు దేశంలోని పలు యూనివర్సిటీలకు చెందిన 13 చిన్నపాటి ఉపగ్రహాలను ప్రయోగించారు. రెండు నుంచి నాలుగు టన్నులకు మించి బరువు కలిగిన అతి పెద్ద ఉపగ్రహాలను ఇస్రో ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష సంస్థల నుంచి పంపిస్తుంటే.. అతి చిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగిస్తోంది. వాణిజ్యపరంగా ఇస్రోకు ఆదాయాన్ని తీసుకొచ్చే అతిపెద్ద ఆదాయ గనిగా మారింది. చంద్రయాన్, మంగళ్‌యాన్, సూర్యయాన్ లాంటి గ్రహాంతర ప్రయోగాలు, ఒకే సారి పది ఉపగ్రహాలు, మళ్లీ 20 ఉపగ్రహాలు, ఆ తరువాత 104, మళ్లీ 38 ఉపగ్రహాలను మోసుకెళ్లి అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టగలిగిన సత్తా పీఎస్ఎల్వీకే మాత్రమే దక్కింది.

సందడే సందడి

పీఎస్ఎల్వీ సీ60 ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాది మంది విచ్చేసి వీక్షించారు. శ్రీహరికోటలోనే ఒక ప్రత్యేక గాలరీని ఏర్పాటు చేశారు. రాత్రి ప్రయోగం కావడంతో రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ వెళ్లే దృశ్యాలను స్పష్టంగా చూడొచ్చునని వీక్షకులు అధిక సంఖ్యలో విచ్చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్లు, బస్సులు బారులు తీరి కనిపించాయి. చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతం మార్మోగింది.



మొదటి దశ నుంచి విడిపోయి..రెండో దశ ప్రయాణం




విడిపోతున్న హీట్ షీల్డ్



మూడో దశ..



ఛేజర్ ఉపగ్రహాన్ని విడిచిపెడుతూ ..



టార్గెట్ ఉపగ్రహాన్ని విడిచి పెడుతూ..

న్యూస్‌రీల్

నేడు పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను మంగళవారం పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 1వ తేదీ ఇంగ్లిష్ నూతన సంవత్సరం నేపథ్యంలో ముందు రోజు పింఛన్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా తప్పిపోతే వారికి జనవరి 2వ తేదీన పింఛన్లు ఇస్తారన్నారు. ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల ప్రక్రియ మొదలు పెట్టాలని చెప్పారు. సచివాలయం వద్దకు లబ్ధిదారులను పిలిపించకుండా వారి ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ఆదేశించారు.

సాగు ఖర్చు తగ్గాలి



కేవీకే ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయుర్వేద మొక్కల స్టాళ్లను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

రేణిగుంట: మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రతి రైతూ వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎదగాలని, అలాగే ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని, వ్యవసాయసాగు ఖర్చులను తగ్గించుకోవాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. తొలుత ఆయన ఎన్జీ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేవీకే రైతుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను గురించి తెలుసుకున్నారు. అటారీ డైరెక్టర్ డా.షేక్‌మీరా, రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ నిండింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,950 మంది స్వామివారిని దర్శించుకోగా 21,098 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.8 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నినదిస్తూ..
నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ!

'కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించింది. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ విద్యార్థుల గోడు పట్టించుకోకుండా పోయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు విడుదల చేయకుండా మొండి చేయి చూపుతోంది' అంటూ విద్యార్థి, యువజన సంఘాల నేతలు ధ్వజమెత్తారు. ఏఐఎస్ఎఫ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం పిలుపు మేరకు ఎస్ఎస్ఎఫ్‌యూఐ, ఏఐవైఎఫ్, వైఎస్సార్ యుజవన విభాగం, జీఎస్ఎస్, ఓబీసీ, పీడీఎస్‌వో విద్యార్థి, యువజన సంఘాల నేతలు వందలాది మంది విద్యార్థులతో కలిసి సోమవారం రోడ్డెక్కారు. విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. అనంతరం అన్నమయ్య సర్కిల్‌లో మానవహారం చేపట్టారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా విమర్శలు గుప్పించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. – తిరుపతి కల్చరల్

విద్యార్థుల గోడు పట్టదా బాబూ?

- ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు విడుదల చేయండి
- యువగళం పాదయాత్ర హామీలు నెరవేర్చండి
- కదం తొక్కిన విద్యార్థి సంఘాల నేతలు



అన్నమయ్య సర్కిల్లో నిరసన ర్యాలీ చేపడుతున్న విద్యార్థి, యువజన సంఘ నేతలు

కక్ష కాదు..కష్టాలు వినండి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించింది. కక్ష సాధింపు చర్యలే లక్ష్యంగా పాలన సాగిస్తోంది. విద్యార్థుల చదువులకు గండి కొట్టింది. విద్యార్థులకు అందించాల్సిన పెండింగ్ ఫీజు బకాయిలు, వసతి దీవెన అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కోర్సులు పూర్తి చేసుకున్నా సర్టిఫికెట్లు లేక విద్యార్థులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వం పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. లేకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జనవరి 29న పోరుబాటలో విద్యార్థి లోకం కదం తొక్కి కనువిప్పు కలిగించక తప్పదు.
– ఓబులురెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

రోడ్డున పడేశారు



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యారంగాన్ని భ్రష్టుపట్టించింది. విద్యార్థులను రోడ్డుపైకి నెట్టేసింది. నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి. లేకుంటే రాజీనామా చేసి రెడ్‌బుక్ మూసుకొని ఇంట్లో కూర్చోవాలి. – బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా నేత

ఆందోళన ఉధృతం



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఒడ్డు దాటాక తెప్ప తగలేసిన చందాగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,580 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాల్సి ఉంది.తక్షణం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం. – మోహన్‌రెడ్డి, వైఎస్సార్ యువజన విభాగం నేత

స్పందించాలి



కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పంపకంలో ఉన్న శ్రద్ధ విద్యార్థుల కష్టాల పట్ల చూపకపోవడం శోచనీయం. కళాశాలలకు చెల్లించాల్సిన బకాయిలు అందక విద్యార్థుల భవిత ఆందోళనకరంగా మారుతోంది. తక్షణం బకాయిలు విడుదల చేయాలి. – ఆశా, పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి

జీవో నం.77ను రద్దు చేయాలి



విద్యార్థులకు శాపంగా మారిన జీవో నం.77ను రద్దు చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ జీవోపై ఇంతవరకు మాట్లాడకపోవడం బాధాకరం. – సుందరరాజ్, ఎస్ఎల్ఎస్ఏ నేత

సీఎం కార్యాలయం ముట్టడి



విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి చలో సీఎం కార్యాలయం ముట్టడి చేపడతాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది. విద్యార్థుల జీవితాలతో చెలగాటం సరికాదు. – తిరుమలేసు, ఓబీసీ నేత

బకాయిలు వెంటనే చెల్లించాలి



విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించకుండా విద్యార్థులను దగా చేస్తోంది. ప్రభుత్వం తక్షణం పెండింగ్ బకాయిలను చెల్లించాలి. – మల్లికార్జున, ఎస్ఎస్‌యూఐ నేత

పుట్టగతులుండవు



విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి నేతలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అదే విద్యార్థుల తిరుగుబాటుతో మట్టికొట్టుకుపోవడం ఖాయం. విద్యార్థులకు అందాల్సిన పథకాలపై నిర్లక్ష్యం తగదు. – ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ప్రశ్నించే గొంతు ఏమైంది?



రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, పీజీ, మెడికల్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు బకాయిలు చెల్లించకపోవడం బాధాకరం. యువత, విద్యార్థుల సంక్షేమం ప్రధానమని ఎన్నికల ముందు మాట్లాడిన నేతలు ఇప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం భావ్యం కాదు. డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు ప్రశ్నించకపోవడంలో దారుణం. – ఏ.సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేత

సమస్యల్లో ఈఎస్ఐ ఆస్పత్రులు

- ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్‌తో ఎంపీ గురుమూర్తి భేటీ



ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్‌కు సమస్యలు వివరిస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఈఎస్ఐ ఆస్పత్రుల్లోని సమస్యలకు పరిష్కారం చూపాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్‌తో ఆయన భేటీ అయ్యారు. శ్రీసిటీ పారిశ్రామిక వాడలో నిర్మించనున్న 100 పడకల ఈఎస్ఐ హాస్పిటల్స్ నిర్మాణంలో ఆలస్యాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాలలోని కార్మికులకు, సాధారణ ప్రజానీకానికి అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంలో ఈఎస్ఐ హాస్పిటల్స్ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన గుర్తుచేశారు. గత పార్లమెంటు సమావేశాలలో భాగంగా జీరో హవర్‌లో ఈఎస్ఐ హాస్పిటల్స్ నిర్మాణం వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు పేర్కొన్నారు. తిరుపతిలోని 50 పడకల ఈఎస్ఐ హాస్పిటల్‌ను 100 పడకల హాస్పిటల్‌గా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సత్యవేడు, తిరుమల, నాయుడుపేట, వరదయ్యపాళెం, నెల్లూరు జిల్లాల్లోని ముత్తుకూరు వంటి కీలక ప్రాంతాల్లోని అనేక ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదని తెలిపారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

మృతదేహం వెలికితీత

కోట: రుద్రవరం వద్ద స్వర్ణముఖిలో ఆదివారం గల్లంతైన పశువుల కాపరి మృతదేహాన్ని సోమవారం ఉదయం వెలికితీశారు. రుద్రవరానికి చెందిన నాగూరయ్య గేదెలను తోలుకుని వెళ్లి స్వర్ణముఖి వరద ప్రవాహంలో గల్లంతైన విషయం తెలిసిందే. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా ఫలితం లేక పోవడంతో సోమవారం బోటు సాయంతో గాలించి నీటిలో కూరుకుపోయి ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

జనవరి 3న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను జనవరి 3వ తేదీన శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు డీఈఓ కేవీఎన్.కుమార్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా నేడు మండల స్థాయి పోటీలను ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీలకు హాజరవ్వాలని వారు సూచించారు.

ప్రతి అర్జీకి పరిష్కారం



ట్రైసైకిల్‌ను అందిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపించే దిశగా అధికారులు పని చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ చేపట్టారు. కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 284 అర్జీలు వచ్చాయి. శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు పంచాయతీ పరిధిలోని ఈశ్వరయ్య కాలనీకి చెందిన గబ్బా వెంకటేశ్వరరావు పుట్టుకతోనే విభిన్న ప్రతిభావంతుడు. ఈ నేపథ్యంలో ఆయనకు ఓ ట్రైసైకిల్‌ను అందించారు. వారితోపాటు ప్రతిభావంతుల శాఖ పర్యవేక్షకులు వినోద్ ఉన్నారు.

రగ్బీ పోటీలకు ఎంపిక



రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాపూరు: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం దయాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భాను, 8వ తరగతి చదవుతున్న చందు ఆంధ్రప్రదేశ్ తరుపున బిహార్ రాష్ట్రం పాట్నాలో జనవరి 1, 2 తేదీలలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.

సిరిసిటీ!

శ్రీసిటీ ప్రగతికి కలిసొచ్చిన 2024

- పటిష్టమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకో సిస్టమ్)
- రూ. 3,750కోట్ల నూతన పెట్టుబడులు రాక
- తద్వారా 17వేల మందికి ఉపాధి
- 16 నూతన పరిశ్రమలు స్థాపన, మరో 9 పరిశ్రమలు విస్తరణ
- నిర్మాణ దశలో ఇంకో 9 పరిశ్రమలు
- రూ.3కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో పలు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు

2024లో రూ.3,750 కోట్ల పెట్టుబడి

శ్రీసిటీ ప్రగతి ప్రస్థానంలో 2024 ఏడాదిలో పటిష్టమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ మరింత వృద్ధి చెందింది. తద్వారా రూ.3,750 కోట్ల నూతన పెట్టుబడులకు ఈ ఏడాది తోడైంది. ఆ దిశగా ఈ ఏడాదిలో 16 నూతన పరిశ్రమలను స్థాపించారు. మరో 9 పరిశ్రమలు విస్తరణ దిశగా అడుగులు వేశాయి. ఇంకా 9 పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. తద్వారా 17 వేల మందికి ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లభించాయి. అలాగే రూ.3.08 కోట్ల కమ్యూనిటీ సోషల్ రెస్పాంసిబిలిటీ (సీఎస్‌ఆర్)నిధులతో పలు పాఠశాలలు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.



శ్రీసిటీలో తయారైన ఉత్పత్తుల గురించి తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

శ్రీసిటీ (వరదయ్యపాళెం): దేశంలోని అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటైన శ్రీసిటీ పారిశ్రామిక వాడకు 2024 కలిసొచ్చింది. ఈ కేంద్రంలో పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకో సిస్టమ్) మరింత పటిష్టం కావడంతో ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలతో పాటు ఇక్కడ నెలకొన్న తయారీదారు, కస్టమర్, సరఫరాదారు గొలుసుకట్టు పారిశ్రామిక అనుకూల వాతావరణం పారిశ్రామికవేత్తలను శ్రీసిటీలో పరిశ్రమల స్థాపనకు మొగ్గుచూపేలా ప్రోత్సహిస్తోంది. ఆ మేరకు ఈప్యాక్ డ్యూరబుల్ ఇండియా, ఎలక్ట్రానిక్స్ గృహోపకరణ ఉత్పత్తుల పరిశ్రమ తన ఉత్పత్తులను శ్రీసిటీలోని హావెల్స్, డైకిన్, ఇతర ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు సరఫరా చేస్తోంది.

కూల్ క్యాపిటల్‌గా ఆవిర్భావం

గత ప్రభుత్వ ప్రోత్సాహంతో శ్రీసిటీ కూల్ క్యాపిటల్‌గా విస్తరించింది. ఆ దిశగా డైకిన్, బ్లూస్టార్, యాంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, హావెల్స్ వంటి ప్రముఖ ఏసీ పరిశ్రమలు ఏర్పాటుతో పాటు వీటికి వివిధ ఉపకరికరాలు సరఫరా చేసే నిడెక్ వంటి అనుబంధ కంపెనీలు రావడంతో దేశంలోనే ఎయిర్ కండీషనర్ తయారీ కేంద్రంగా, కూల్ క్యాపిటల్‌గా శ్రీసిటీ విస్తరిస్తోంది.

సుస్థిరతకు పెద్దపీట

పర్యావరణ నిర్వహణలో శ్రీసిటీ నిబద్ధత, అమలు విధానాలు, అంతర్జాతీయ ఖ్యాతి గడించింది. ఈ చర్యలో భాగంగా చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పలు వినూత్న కార్యక్రమాలకు గుర్తింపుగా పలు అవార్డులు సొంతం చేసుకుంది.

ప్రశంసలు, గుర్తింపులు

హెరాల్డ్ గ్లోబల్ ఇంటర్నేషనల్ బ్రాండ్ అడ్వర్టైజింగ్ రీసెర్చ్ అండ్ కన్సల్‌టింగ్ (బ్రాండ్ ఆఫ్ ది డికేడ్) అవార్డు, ముంబైలో నిర్వహించిన గోల్ ఫెస్ట్ కాన్‌క్లేవ్ 2024, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీ (సీఐఐ) సంస్థ వారి సీఎఫ్‌ఓ ఎక్స్‌లెన్స్ అవార్డు ద క్యాయి. అలాగే శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్, ఐఎఫ్‌ఎఫ్, టాటా స్మార్ట్ ఫుడ్స్, యాక్సెంచర్ ఫార్మా, మ్యాంగో రిసార్ట్స్ పరిశ్రమలు వాటి ప్రత్యేకతలకు గాను అవార్డులు అందుకున్నాయి.

2024లో జరిగిన ముఖ్య ఘటనలు

- గత ఆగస్టు 19న ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్‌తో కలిసి శ్రీసిటీ ప్రగతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగాయి. వీటితో పాటు శ్రీసిటీలో నూతనంగా నిర్మించనున్న ఫైర్ స్టేషన్‌కు అధునాతన నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణాలకు భూమిపూజ చేశారు.
- మార్చి 6న మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు శ్రీసిటీని సందర్శించి పారిశ్రామిక ప్రగతి ఉపాధి కల్పన, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు.
- నవంబర్ 14న నీతి అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం శ్రీసిటీని సందర్శించారు.
- అక్టోబర్ 29న రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి టీజీ భరత్ శ్రీసిటీలో పరిశ్రమల ప్రధాన కార్యనిర్వాహకులు (సీఈఓలు), ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం 4.0 తీరుతెన్నులను వివరించారు.
- డిసెంబర్ 18న ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమలో ఉత్పత్తైన వాహనాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

సామాజిక బాధ్యత

- శ్రీసిటీ, వివిధ పరిశ్రమలు సామాజిక సంక్షేమం పట్ల తమ నిబద్ధతను ప్రదర్శిస్తూ వరద సహాయక కార్యక్రమాలకు మద్దతుగా జిల్లా విపత్తు సహాయ నిధికి రూ.కోటి విరాళం అందించింది.
- పరిసర ప్రాంత సామాజిక అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.3.08 కోట్లకు పైగా ఖర్చు పెట్టింది.
- శ్రీసిటీ జపనీస్ పరిశ్రమల అసోసియేషన్ (ఎస్‌జేసీఏ) పార్క్‌సన్ ప్యాకేజింగ్, యూనిఛామ్, ట్రికాల్, ఇసుజు మోటార్స్, ఎన్‌ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఐఎంటీపీ, హామిల్టన్ పరిశ్రమలు రూ.3.08 కోట్లకు పైగా సీఎస్‌ఆర్ ప్రాజెక్టుల ద్వారా విద్యా, ఆరోగ్య సంరక్షణ, సామాజిక అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాయి.

2024 ముఖ్యమైన ఏడాది

శ్రీసిటీ ప్రస్థానంలో 2024 సంవత్సరానికి ఒక ముఖ్యమైన ఏడాదిగా చెప్పుకోవాలి. ఇందులో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. ఇదే స్ఫూర్తితో 2025లోనూ నూతన పరిశ్రమలు, పెట్టుబడులు, ఇతర కార్యకలాపాలకు అత్యంత కీలకంగా భావించి ముందుకెళ్తాం. ఈ ఏడాది కూడా అంతా మంచే జరగాలని ఆశిస్తున్నా.

– డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీసిటీ

38 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న 38 మందికి ఒక్కొక్కరికీ పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరిండెంట్ ఎస్‌వీ.సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆదేశాల మేరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్ట్ కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. 2024 సంవత్సరంలో అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 84 మందికి జైలు శిక్ష, ఒక్కొక్కరికీ పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు కోర్టు కానిస్టేబుల్ తెలిపారు. అలాగే తక్కువ మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 1,322 మందికి ఒక్కొక్కరికీ 10 వేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. జరిమానాల రూపంలో ఒక కోటి 37 లక్షల 50 వేల రూపాయలు ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్టు ఆయన తెలిపారు.

ప్రొఫెసర్ సస్పెన్షన్



ఉమామహేష్

తిరుపతి సిటీ: ఎస్వీ వ్యవసాయ కళాశాల క్రాప్ ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ వీ.ఉమామహేష్‌ను సస్పెండ్ చేస్తూ ఎన్జీరంగా వర్సిటీ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేశారు. తిరుపతి న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించిన నేపథ్యంలో ఉద్యోగుల క్రమశిక్షణా నియమనిబంధనల ప్రకారం వర్సిటీ అధికారులు ఆయనపై సస్పెన్స్ వేటు వేశారు.

మాతమ్మా.. రాజకీయ రగడ ఏందమ్మా?



కమ్మకొత్తూరులో మాతమ్మ ఆలయ స్థలంలోని ఫెన్సింగ్ రాళ్లను తొలగించిన టీడీపీ అనుచరులు



కమ్మకొత్తూరు గ్రామంలో ఇరువర్గాల ఘర్షణ

- దళితుల మధ్య చిచ్చుపెట్టిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పీఏ

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం, కమ్మకొత్తూరు అరుంధతీవాడ, దళితవాడ గ్రామస్తుల మధ్య మాతమ్మ ఆలయ స్థల వివాదం సోమవారం తెర మీదకు వచ్చింది. టీడీపీ అనుచరులు దౌర్జన్యంగా ఆలయ ఫెన్సింగ్ రాళ్లను తొలగించారు. స్థానికుల కథనం.. కమ్మకొత్తూరు అరుంధతీవాడ శివారున మాతమ్మ ఆలయానికి పొంగళ్లు పెట్టుకునేందుకు 17.5 సెంట్లు స్థలం ఉంది. ఈ స్థలాన్ని అరుంధతీవాడ వాసులు కొన్నేళ్ల కిందట సుబ్రమణ్యంశెట్టి నుంచి విక్రయించి భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు వినియోగిస్తున్నారు. అయితే ఈ మార్గంలో దళితవాడకు దారి వదలాలని రెండు కాలనీల మధ్య వివాదం నడుస్తోంది.

ఎమ్మెల్యే పీఏ అండతో..

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పీఏ శ్రీనివాసులునాయుడు ఈ వివాదాన్ని రాజకీయంగా మార్చారు. దళితవాడ వాసులను రెచ్చగొట్టి సోమవారం వారితో కలసి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఫెన్సింగ్ రాళ్లను కూల్చివేశారు. దీంతో అరుంధతీవాడ వాసులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే పీఏతోపాటు డీ.రమేష్‌నాయుడు, చిరంజీవినాయుడు, పీ.బాబునాయుడు, ఎస్సీ కాలనీకి చెందిన వీరయ్య, బాలగురవయ్య, రాధామణి గున్నయ్య, శంకర్, క్రిష్టయ్య కలసి అరుంధతీవాడ వాసులపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. తర్వాత అరుంధతీవాడ వాసులు సోమవారం రాత్రి శ్రీకాళహస్తిలోని తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. అన్నదమ్ములుగా ఉన్న తమ మధ్య ఎమ్మెల్యే పీఏ శ్రీనివాసులు నాయుడు చిచ్చుపెట్టారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే తమపై దాడి చేశారని అరుంధతీవాడకు చెందిన కొందరు మహిళలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

2024 సైబర్ టెర్రర్



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

- వార్షిక నేరాల గణాంకాలను వివరించిన జిల్లా ఎస్పీ

తిరుపతి క్రైం: సైబర్ నేరగాళ్లు 2024లో హడలెత్తించారు. అమానవీయ ఘటనలు ఉలిక్కిపాటుకు గురిచేశాయి. వ్యవస్థీకృత నేరాలు సవాలుగా మారాయి. వీటి కట్టడికి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ఎప్పటికప్పుడు సాంకేతికత తోడుగా కేసుల ఛేదనకు ప్రయత్నిస్తున్నా సైబర్ నేరాలు, చోరీలు, గొలుసు దొంగతనాలు, అత్యాచారాలు వంటివి ఆగడం లేదు. ఈ ఏడాది ముగ్గురు ఎస్పీలు బదిలీ అయ్యారు. ప్రస్తుతం సుబ్బరాయుడు ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2024 సంవత్సరానికి ముగింపు పలికేందుకు సమాయత్తమవుతున్న తరుణంలో పోలీసు శాఖ జిల్లా వార్షిక నివేదికను సోమవారం జిల్లా ఎస్పీ విడుదల చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జరిగిన సైబర్ నేరాల కేసులు చూస్తే భయమేస్తోంది. ఇక రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తసిక్తమయ్యాయి.

రక్తమోడిన రహదారులు

జిల్లాలో సగటున రోజుకు రెండు, మూడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జిల్లా మీదుగా కీలకమైన జాతీయ రాష్ట్ర రహదారులు వెళ్తున్నాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం తదితర కారణాలతో జిల్లాలోని ప్రధాన రహదారులు నిత్యం నెత్తురోడుతున్నాయి. గతేడాది 1,039 రోడ్డు ప్రమాదాలు జరగగా, ఈ ఏడాది వాటి సంఖ్య 1015కు చేరింది.

దొంగల హల్‌చల్

జిల్లాలో చోరీలు ఆందోళన కలిగిస్తున్నాయి. దొంగతనాలు గతేడాదితో పోలిస్తే తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నా బాధితులు పోగొట్టుకున్న సొమ్ము కోట్లలోనే ఉంటోంది. 2023లో అన్ని రకాల చోరీలు 993 చోటు చేసుకోగా ఈ ఏడాది నవంబర్ వరకు 983 చోరీలు జరిగాయి. అదేవిధంగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆరు హత్య కేసులు పెరిగాయని ఎస్పీ పేర్కొన్నారు. హత్యలన్నీ కూడా అక్రమ సంబంధాలు, ఆస్తి తగదా వల్ల జరిగినవే. మిస్సింగ్ కేసుల్లో కూడా 98 శాతం గుర్తించారు.

జిల్లాలో మొత్తం నేరాలు

నేరాలు	2023లో	2024లో
దేహ సంబంధిత	933	921
ఆస్తి సంబంధిత	993	983
రోడ్డు ప్రమాదాలు	1,039	1,015
సైబర్ నేరాలు	173	248
వైట్ కాలర్ నేరాలు	336	312
ఇతర నేరాలు	2,651	2,217

మత్తుకుంటున్నా వినరే!

జిల్లాలో గంజాయి వినియోగం పెరిగింది. ఈ ఏడాది 85 కేసుల్లో దాదాపు 223 మంది గంజాయి అక్రమ రవాణా, విక్రయదారులను అరెస్టు చేశారు. వారి నుంచి 8,72,307 కిలోల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఇందులో 239 మంది నేరస్థులపై గాంజా షీట్స్‌ను ఓపెన్ చేశారు. మొబైల్ హ్యాండ్ ద్వారా ఇప్పటివరకు రూ.7.56 కోట్ల విలువచేసే 4,275 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. రూ.36 లక్షల అనధికార మద్యం బాటిళ్లను రోడ్ రోలర్‌తో ధ్వంసం చేశారు.

వల వేసి.. ఖాతాలు ఊడ్చేసి

ఈ ఏడాది జిల్లాలో సైబర్ నేరగాళ్లు అందినకాడికి దోచుకున్నారు. కొందరి అత్యాశను సైబర్ నేరగాళ్లు అనుకూలంగా మార్చుకున్నారు. నకిలీ లింకులు పంపుతూ ఓటీపీ చెప్పమని నమ్మబలుకుతూ ప్రజల సొమ్మును ఖాతాల్లో నుంచి దోచేశారు. ప్రజలు సైబర్ మోసాల బారినపడకుండా పోలీసు శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉండడం ఆందోళనకరం. గత ఏడాది 173 సైబర్ కేసులు నమోదు కాగా.. రెండు కోట్ల 44 లక్షల రూపాయల వరకు మోసపోయారు. ఇందులో 84 లక్షల ఎనిమిది వేల రూపాయలు పోలీసులు రికవరీ చేశారు. 2024లో 248 కేసులు నమోదయ్యాయి. 12 కోట్ల 89 లక్షలు రూపాయలు పోగొట్టుకోగా.. రెండు కోట్ల 36 లక్షల వరకు రికవరీ చేశారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం



హారతి పడుతున్న అర్చకులు


తిరుమల : తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో 25 రోజుల పాటు జరగనున్న అధ్యయనోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు రంగనాయకుల మండపంలో అధ్యయనోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందు నుంచి శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, శ్రీవారి ఆలయ పేష్కర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ ఆరు లక్షల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం సెషన్స్ కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ అధికారి రాజగోపాల్ రెడ్డి, కోర్ట్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. 2016 డిసెంబర్ 23వ తేదీ భాకరాపేట పోలీసులు చిన్నగొట్టిగల్లు మండలం, భూతంవారిపల్లి బస్‌స్టాప్ వద్ద వాహనాలను తనిఖీ చేయగా ఓ ఆటోలో 4 ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పీలేరు మండలం, రేగల్లు, బోయపల్లికి చెందిన ఆటో డ్రైవర్ లింగం అశోక్, పీలేరు, ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన పులికంటి క్రాంతికుమార్ అలియాస్ క్రాంతి పోలీసులకు పట్టుబడ్డారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధించారు.

సంద్రమా..ఊపిరి పీల్చుకో

– రెండు నెలల తర్వాత సాగర కెరటాలపై రవి కిరణాలు



తూపిలిపాళెం వద్ద వేటకు వెళుతున్న మత్స్యకారులు

వాకాడు: బంగాళాఖాతంలో వరుస తుపాన్ల కారణంగా రెండు నెలలుగా సాగర కెరటాలపై వెచ్చని రవి కిరణాల జాడ కనిపించ లేదు. ఇన్నాళ్లు చలి గాలులతో గజగజ వణికిపోయిన తీర ప్రాంత ప్రజలు రెండ్రోజులుగా వాతావరణం కాస్త అనుకూలించడంతో ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం వాకాడు మండలం, తూపిలిపాళెం సముద్ర తీరంలో రవికిరణాల జాడ కనిపించింది. కిరణాలు జగతిని హత్తుకునే విధంగా ఉదయించడంతో ప్రకృతి ప్రేమికులు పరవశించి పోయారు. గంగ పుత్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. సామగ్రిని సర్దుకుని తూర్పు దిశగా వేటకు బయలుదేరారు.

బస్సు కింద పడి యువకుడి మృతి

తిరుపతి క్రైం: నగరంలోని రేణిగుంట రోడ్‌లో బస్సు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం.. ఒడిశాకు చెందిన హరీష్ (18) వారి అన్న హరికృష్ణతో కలిసి కాటన్ మిల్ రైల్వే గేట్ వద్ద బస్సును ఓవర్ టేక్ చేయబోయారు. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన బస్సు వెనుక చక్రం కింద పడి హరీష్ అక్కడికక్కడే మృతి చెందగా.. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న హరికృష్ణ స్వల్ప గాయాలతో ఆస్పత్రిలో చేరాడు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. అలిపిరి పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఏడు కిలోల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. రెండో పట్టణ పోలీసుల కథనం.. ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఇద్దరు ఒడిశాకు చెందిన యువకులు గంజాయితో సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు రెక్కీ నిర్వహించి ఏడు కిలోల గంజాయితో సహా ఒడిశాకు చెందిన బిజయ్(29), సుక్కు(25)ను అరెస్టు చేశారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.

ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ వసూళ్లు



ఈఓకి ఫిర్యాదు చేస్తున్న హోటల్ నిర్వాహకులు



రశీదులు చూపిస్తున్న హోటల్ నిర్వాహకులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):ఇండియన్ ఫుడ్ సేఫ్టీ మేనేజ్మెంట్ అధికారులమంటూ రెండు రోజులుగా రేణిగుంట పట్టణంలోని హోటల్స్ వద్దకు వెళ్లి అపరాధ రుసుం వసూలు చేశారు. ఆరుగురు బృందంగా ఏర్పడి హోటల్ నిర్వాహకులను బెంబేలెత్తించారు. వారి వద్ద ఎలాంటి రశీదులు, స్టాంపులు లేకపోవడంతో అనుమానం వచ్చి సోమవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో కార్యదర్శి మణి తమ సిబ్బందితో హోటళ్ల వద్ద తనిఖీ చేస్తున్న బృందం వద్దకు వెళ్లడంతో వారిలో ఇద్దరు వెళ్లిపోయారు. నలుగురిని పంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకొచ్చి విచారించారు. రెండు రోజుల్లో మొత్తం నాలుగు లక్షల రూపాయలు వసూలు చేసినట్టు సమాచారం. రేపటి వరకు సమయం ఇస్తే ఆధారాలన్నీ చూపిస్తామని వారు తెలపడంతో శుక్రవారం ఉదయం 10 గంటలకు కార్యాలయం వద్దకు రావాలని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ఫిర్యాదు మేరకు విచారిస్తున్నాం

హోటల్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగదు వసూళ్లు చేసిన వారిని విచారిస్తున్నాం. వారి వద్ద ఉన్న బిల్ బుక్కులు, రూ.15 వేల నగదును సీజ్ చేశాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలుంటాయి.

– మణి, ఈఓ. రేణిగుంట పంచాయతీ

ఆదిఆంధ్ర అంటే మాదిగలే!



కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ జాతీయ నేతలు నరేంద్రబాబు మాదిగ, పులికుంట్ల గోపి మాదిగ

తిరుపతి అర్బన్: జిల్లాలో ఆదిఆంధ్ర పేరుతో ఉండే ఎస్సీలు మాదిగ కులానికి చెందినవారేనని ఎంఆర్‌పీఎస్ జాతీయ నేతలు నరేంద్రబాబు మాదిగ, పులికుంట్ల గోపి మాదిగ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సందర్భంగా ఎంఆర్‌పీఎస్‌కు చెందిన నేతలు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన వారు ఎస్సీ–ఏ, ఎస్సీ–బీ, ఎస్సీ–సీ, ఎసీ–డీగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ క్రమంలో మాలలు ఎస్సీ–సీలోను, మాదిగలు ఎస్సీ–బీలో ఉన్నారని తెలిపారు. అయితే తిరుపతి జిల్లాలో ఆది ఆంధ్ర పేరుతో మాదిగలను ఎస్సీ–డీలో ఉంచారని ఆవేదన చెందారు. ఆది ఆంధ్రకు చెందిన వారు మాదిగలేనని వారిని ఎస్సీ–బీలో చేర్చాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ నేతలు వాసుదేవరావు, వేలూరు రాజేంద్ర, వావిళ్ల శివయ్య, నవీన్‌కుమార్, పరమాల మునువేలు, బోయినపల్లి రవి, సంగీతం రామ్మూర్తి పాల్గొన్నారు.